సూపర్ సిక్స్ పథకాలు విజయవంతం కావాలని..

వివరాలు 08లో

## ఆరు భారీ రొట్టెలు చేయించిన ఎమ్మెల్యే కోటంరెడ్డి

అపార పరిపాలనానుభవం గల ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా సూపర్ 6 పథకాలు విజయవంతంగా అమలవుతాయని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు.

నెల్లూరు, మేజర్‌న్యూస్ :



సూర్య దినపత్రిక
17 వ వసంతంలోకి
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు
ఆదివారం | 21 జులై 2024 | పేజీలు 8


ప్రహరీ లేని ఐసీడీఎస్ కార్యాలయం

# రక్షణ కరువైన ఐసీడీఎస్ కార్యాలయం

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు ఐసీడీఎస్ కార్యాలయ భవనాలకు రక్షణ కరువైంది. అక్కడ పనిచేసే వారికి అసౌకర్యంగా ఉంటోంది. నెల్లూరు – ముంబాయి రహదారిపై నెల్లూరుపాళెం వద్ద ఐసీడీఎస్ కార్యాలయ పక్కాభవనాలను నిర్మించి గత ఏడాది ప్రారంభించారు. సీడీపీవో ఆధ్వర్యంలో సూపర్‌వైజర్లు, సిబ్బంది అక్కడ విధులు నిర్వహిస్తుంటారు. తరచూ ఈ ప్రాజెక్టు పరిధిలోని ఆత్మకూరు, ఏఎస్‌పేట, సంగం, చేజర్ల మండలాలకు చెందిన అంగన్‌వాడీ కార్యకర్తలకు సమావేశాలు నిర్వహిస్తుంటారు. అయితే ఈ భవనాలకు చుట్టూరా ప్రహరీగోడ నిర్మించనందున నిత్యం పశువులు, గొర్రెలు, మేకలు విచ్చలవిడిగా సంచరిస్తుంటాయి. చుట్టూరా కంపచెట్లు ఉండడం, ప్రహరీ లేనందున విషజంతువుల సంచారం కూడా ఉంటుంది. ఆవరణ చదునులేక, కనీసం అనుసంధాన రహదారిని పటిష్టంగా నిర్మించనందున ఇబ్బందికరంగా ఉంటోంది. ఉన్నతాధికారులు ఈ పరిస్థితిని గమనించి వెంటనే ఈ కార్యాలయ భవనాలకు ప్రహరీగోడ నిర్మించాల్సిన అవసరం, ఆవరణ చదును చేసి, అనుసంధాన రహదారిని చక్కబెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

పేరుకే సిమెంట్ రోడ్డు..

## మట్టిరోడ్డు కంటే దారుణం !



**జలదంకి, మేజర్‌న్యూస్ :** జలదంకి మండలంలోని జమ్మలపాలెం రైతు సేవా కేంద్రం వద్ద సిమెంట్ రోడ్డు మట్టి రోడ్డు కన్నా దారుణంగా తయారైంది. కాలు తీసి కాలు పెట్టాలన్నా.. ఎక్కడ పడిపోతామోనన్న భయంతో ప్రజలు నడవాల్సిన దుస్థితి ఏర్పడింది. కారణం ఒకప్పుడు సిమెంట్ రోడ్డు నిర్మించారు. అయితే ఆ సిమెంట్ రోడ్డుపై మట్టి పేరుకొని కాలు పెడితే జారిపడి పోయేలా తయారైంది. చిన్నారులు పాఠశాలలకు వెళ్లాలన్నా కష్టంగా ఉంది. పాలకులు పట్టించుకోక, అధికారులు ఉదాసీనంగా వ్యవహరించడంతో పరిస్థితి ఇలా తయారైందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. సిమెంట్ రోడ్డు వేయకుండా మట్టి రోడ్డు ఉంటేనే బాగుండేదని పలువురు ప్రజలు పెదవి విరుస్తున్నారు. కారణం వర్షం పడిన కొద్దిసేపటి తరువాత మట్టి రోడ్డు గట్టిగా మారి నడిచేందుకు వీలుగా ఉంటుందని అంటున్నారు. సిమెంట్ రోడ్డుపై మట్టి పేరుకుపోవడం పట్టించుకోకపోవడంతో పరిస్థితి ఇలా తయారైందని, కేవలం పాలకుల నిర్లక్ష్యమేనని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు అధికారులు స్పందించి సిమెంట్ రోడ్డుపై ఉన్న మట్టి తొలగించాలని ప్రజలు వేడుకుంటున్నారు.

చిత్రం.. భళారే విచిత్రం !

హంగులు అధికారులకు..

వివరాలు 02లో

## అవస్థలు విద్యార్థులకు !



విద్యార్థులతో మమేకమైన

## కలెక్టర్ ఆనంద్

- వసతి సౌకర్యాలపై ఆరా
- గురుకుల పాఠశాలను పరిశీలించిన కలెక్టర్

2 లో



## బోధనలో కార్పొరేట్ స్కూల్స్‌తో పోటీ పడండి

మినగల్లు హైస్కూల్‌లో విద్యాకిట్ల పంపిణీ చేసిన ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి



8లో..

విద్యార్థులను భావి పౌరులుగా తీర్చిదిద్దే గురుతర బాధ్యత మాత్రం గురువులదేనని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి అన్నారు. శనివారం బుచ్చిరెడ్డి పాళెం మండలం మినగల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యాకిట్ల పంపిణీ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థినీ విద్యార్థులకు విద్యా కిట్ల అందజేశారు.

కొవ్వూరు, మేజర్‌న్యూస్ :

కార్పొరేషన్ కమిషనర్ల సంతకాలు ఫోర్జరీ కేసులో..

## ఎఫ్ఐఆర్ నమోదు



- మేయర్ భర్త జయవర్ధన్ పాత్ర ఉన్నట్లు నిర్ధారణ
- 7 మంది నిందితులపై దర్గామిట్ట పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు
- అరెస్ట్ చేసేందుకు రంగంలోకి పోలీసు బృందాలు
- అజ్ఞాతంలోకి పలువురు నిందితులు

వివరాలు 2 లో

# చిత్రం.. భళారే విచిత్రం !

## హంగులు అధికారులకు.. అవస్థలు విద్యార్థులకు

**మర్రిపాడు, మేజర్‌న్యూస్ :** మండల కేంద్రమైన మర్రిపాడులో ఈ చిత్రాలను చూస్తే ప్రతి ఒక్కరూ విస్తు పోవాల్సిందే. ఓ పక్క సంవత్సరాల తరబడి నుండి ప్రభుత్వ బాలుర ఎస్సీ వసతి గృహం శిథిలావస్థకు చేరి నానా తంటాలు పడుతుంటే మరోపక్క రంగుల రంగులతో అధికారులు ఉండే ఎంపీడీవో కార్యాలయానికి మాత్రం హంగులకు కొదవలేదు. ఈ వర్షాలకు ఎప్పుడు ఏ సమయం లో స్లాబ్ కూడి విద్యార్థులకు ప్రాణాపాయం వాటిల్లుతుందోనని విద్యార్థుల తల్లిదండ్రులు భయాందోళన చెందుతున్నారు. కనీసం మౌలిక సదుపాయాలు కూడా కరువై కాల కృత్యాలు తీర్చుకునేందుకు కూడా ఆరు బయటకు వెళ్లాల్సిన పరిస్థితి.








దీంతోపాటుగా విద్యా ర్థులు ఉంటున్న గదులు వర్షం వస్తే ఉరుస్తున్నాయి. ఫలితంగా అధికారులు మౌనం దాల్చ డమే కాకుండా గత ఐదేళ్ల నుంచి మరమ్మ త్తులు కూడా నోచుకోక శిథిలావస్థలో విద్యార్థులు కాలం గడుపుతున్నారు. సంవత్సరాల తరబడి నుండి విద్యార్థులు ఇన్ని బాధలు పడుతున్న పట్టించుకోక పోవడమేకాకుండా స్థానికంగా ఉండే ఎంపీడీవో కార్యాలయాన్ని లక్షల రూపా యలు వెచ్చించి కేవలం మూడు నెలల్లో హంగులతో తీర్చిదిద్ది వారు ఉండేందుకు మాత్రం ఇంద్రకీలాద్రిగా మార్చుకున్న సంఘటన ప్రతి ఒక్కరిని ఆశ్చర్యపడేలా చేస్తోంది. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు అధికారులవే ప్రాణాల మా బిడ్డలవి ప్రాణాలు కావా.. అని నిలదీస్తున్నారు. మండల కార్యాలయాలకు వచ్చిన ప్రజలు కూడా ఇది చిత్రమే కాదు భళారే విచిత్రంగా ఉందని పలువురు చర్చించుకుంటూ వెళ్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ఈ విషయాన్ని స్పష్టంగా గమనించి తగు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# గురుకుల పాఠశాలను పరిశీలించిన కలెక్టర్

## వసతి సౌకర్యాలపై ఆరా - విద్యార్థులతో మమేకమైన కలెక్టర్

**నెల్లూరు/కొడవలూరు, మేజర్‌న్యూస్ :** కొడవలూరులోని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలను కలెక్టర్ ఆనంద్ పరిశీలించారు. శనివారం కొడవలూరు పర్యటనకు విచ్చేసిన కలెక్టర్ స్థానిక గురుకుల పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గురుకుల పాఠశాలలో విద్యార్థుల సంఖ్య, అందిస్తున్న వసతి సౌకర్యాలను హెచ్ ఎం దేవ సహాయంను అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది హాజరు పట్టిక, పలు రిజిష్టర్లను పరిశీలించారు. అనంతరం వంటగది, స్టోర్ రూమ్, మరుగుదొడ్లు, విద్యార్థుల నివాస గదులు, తరగతి గదులను కలెక్టర్ పరిశీలించారు. ఎనిమిదో తరగతి గదిలో విద్యార్థులతో మమేకమైన కలెక్టర్, వారి అభ్యసన సామర్థ్యాలను పరీక్షించారు. బోర్డు పై ఒక గణిత సమస్య రాసి పరిష్కరించాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థులకు క్రమం తప్పకుండా వైద్య సేవలు అందిస్తున్నారా.. అని వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు. డాక్టర్ల విజిటింగ్ రిజిస్టర్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించి నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేయాలని అధికారులు, ఉపాధ్యాయులకు సూచించారు. కలెక్టర్ వెంట ట్రైబల్ వెల్ఫేర్ అధికారి పరిమళ, ఎంఈఓ లు వసంత కుమారి, అంకయ్య, తహసిల్దార్ శైలేంద్రకుమార్ ఉన్నారు.





# లక్ష్యాలు వెచ్చించడంతో సరి

## లక్ష్యం గురించి యోచించడం లేదు మరి !

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరులో అవసరమున్న కార్యాలయాలకు, సిబ్బందికి భవనాలు, క్వార్టర్లు ఉండవు, అక్కరలేని చోట్ల భవనాలు నిర్మిస్తారు, నిర్మించిన భవనాలు వినియోగంలో లేకున్నా పట్టించుకోరనేది సర్వసాధా రణమైంది. రూ.లక్షలు వెచ్చించడమే తప్ప వాటిని వినియోగిస్తున్నారా లేదా, లక్ష్యం నెరవేరుతుందా.. లేదా.. వినియోగించకుంటే కారణాలు ఏమిటి, అక్కర లేకుంటే ఎందుకు నిర్మించారనే విషయాల గురించి పాలకులు కానీ, ఉన్నతా ధికారులు కానీ ఏమాత్రం పట్టించకునే పరిస్థితే లేదు. నివాసాలకు నిర్మాణ భవనాలు లేక పలువురు ఇబ్బందిపడుతుండగా నిర్మించిన ఇళ్ళలో ఉద్యోగులు చేరకుండా నిరుపయోగమవుతున్న దృశ్యాలు పలుచోట్ల దర్శనమిస్తుంటాయి. అలాంటి ఆత్మకూరు ఫారెస్ట్ కార్యాలయం వద్ద, నెల్లూరుపాళెం వద్ద శిథిలమవుతూ దర్శనమిస్తున్నాయి. 1978లో నెల్లూరు-ముంబాయి రహదారిపై నెల్లూరు పాళెం చెక్‌పోస్ట్ వద్ద రూ.10 లక్షల వ్యయంతో క్వార్టర్లు నిర్మించారు. అప్పటి అటవీశాఖ కన్సర్వేటర్ సి.మురళీధరరావు, డిఎఫ్‌వో ఎస్‌ఎస్ శ్రీధర్‌ల చేతులమీదుగా ఈ క్వార్టర్లను ప్రారంభించారు. సర్వాంగ సుందరంగా ఈ భవ నాలు నిర్మించగా ఒక్కరోజు కూడా ఉద్యోగులు అక్కడ నివాసాలున్న పాపాన పోలేదు. అప్పటి అటవీ క్షేత్రాధికారి సి.వేణుగోపాల్ రావు ప్రత్యేకంగా కృషి చేసి ఈ భవనాలను మంజూరు చేయించారు. ఇక ఆత్మకూరు పట్టణంలోని అటవీ కార్యాలయంలో కూడా అధికారులకు, సిబ్బందికి క్వార్టర్లు నిర్మించారు. అప్పట్లో అధికారులు మాత్రం ఒకరిద్దరు నివాసాలుండేవారు సిబ్బందిమాత్రం ఇక్కడ నివాసాలున్న దాఖలాలు లేవు. ఏదేమైనా లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించిన క్వార్టర్లు మాత్రం నిరుపయోగమై శిథిలమయ్యా.యి. ఆ భవనాలకు మరమ్మత్తులు చేయించి వినియోగంలోకి తెచ్చేందుకు ఎవరూ కృషిచేయలేదు. పూర్తిగా శిథిలమై లక్షలాది రూపాయల వ్యయం బూడిదలో పోసిన పన్నీరు చందంగా ఉంది. కనీసం ఆ భవనాలను తొలగించి స్థలాలు చదునుచేసి నూత నంగా క్వార్టర్లు నిర్మించే చర్యలు తీసుకోవడం లేదు.



నిర్మిస్తే అక్కడ సిబ్బంది నివాసాలుం టారన్న భరోసా లేనందునే ప్రభుత్వం పట్టించుకోవడం లేదని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. ఎవరి వ్యాఖ్యలు ఎలా ఉన్నా.. ప్రభుత్వపరంగా ఏదోఒక చర్యలకు దృష్టి సారించాల్సిన అవసరం మాత్రం ఉంది.

### సీజనల్ వ్యాధులు ప్రబలకుండా

## చర్యలు తీసుకోండి : కలెక్టర్ ఆనంద్



**విడవలూరు, మేజర్‌న్యూస్ :** సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఆయా శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆనంద్ కోరారు మండల కేంద్రమైన విడవలూరు ఆయన శనివారం ఆకస్మికంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డయేరియా మలేరియా ఇతర సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అన్ని శాఖల అధికారుల సమన్వయంతో ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా పారిశుధ్యంపై ప్రత్యేక ప్రణాళిక ఉండాలను కోరారు. ప్రతిరోజు పరిస్థితి సిబ్బంది చెత్తాను తొలగించడంతోపాటు బ్లీచింగ్ చల్లారని, సైడ్ కాలువలలో మురికినీరు ప్రవహించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. అంతేకాకుండా ఆరోగ్య సిబ్బంది ఎప్పటికప్పుడు వివిధ కాలనీలో పర్యటిస్తూ వారికి అవగాహన కల్పించాల్సిన బాధ్యత ఉందన్నారు. ముఖ్యంగా పంచాయతీ కార్యదర్శులు పరిశుద్ధంపై అప్రమత్తంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

### కార్పొరేషన్ కమిషనర్ల సంతకాలు

## ఫోర్జరీ కేసులో ఎఫ్ఐఆర్ నమోదు

**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నూతన భవనాలు నిర్మాణాలకు సంబంధించి తన ప్రమేయం లేకుండా నిబంధనలకు విరుద్ధంగా తమ సంతకాలను ఫోర్జరీ చేసి మార్టగేజ్‌లు విడుదల చేశారని నెల్లూరు కమిషనర్ వికాస్ మర్మత్ గతవారం జిల్లా ఎస్పీకి స్వయంగా ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదును పోలీస్ కార్యాలయం నుంచి దర్గా మిట్ట పోలీసులకు పంపగా.. సెక్షన్ అండ్ సెక్షన్ 107)2024 యూ/ఎస్ 120(బి) 420, 467, 468, 471 ఆర్/డబ్ల్యూ నాన్ బెయిలబుల్ సెక్షన్లు నమోదు చేశారు. ప్రధాన నిందితులుగా మేయర్ భర్త జయవర్ధన్, అతని అనుచరుడు శివశంకర్ మరో నలుగురు ఉద్యోగులపై కేసు నమోదు చేశారు. ఈ ఫోర్జరీ విషయమై గతంలో ఇద్దరు కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్ అధికారులను కమిషనర్ సస్పెండ్ చేశారు. అయితే నిందితులు అజ్ఞాతంలోకి వెళ్లారని, వారి కోసం పోలీసులు గాలిస్తున్నారు.

## మంత్రి 'ఆనం'ను సన్మానించిన టీడీపీ నాయకులు



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని శనివారం ఆత్మకూరుకు చెందిన 4వవార్డు తెలుగుదేశం అధ్యక్షుడు దాసరి మధుసూధనరావు ఆధ్వర్యంలో పలువురు నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి పుష్పగుచ్ఛాలతో ఘనంగా సన్మానించారు. రెండు నెలల క్రితం జరిగిన ఎన్నికల్లో ఆత్మకూరు ఎమ్మెల్యేగా ఎన్‌డిఏ కూటమి తరపున తెలుగుదేశం అభ్యర్థిగా పోటీ చేసి ఘన విజయం సాదించిన ఆనం రామనారాయణరెడ్డి రాష్ట్ర మంత్రివర్గంలో దేవాదాయ శాఖ మంత్రి పదవిని దక్కించుకున్న విషయం విదితమే. కాగా మధుసూధనరావు తదితరులు మంత్రి రామనారాయణరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించి స్థానిక రాజకీయాల గురించి కూడా చర్చించారు. కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు దాసరి బాలకృష్ణ, దేవరాయపల్లి ధనుంజయ, మల్లిపెద్ది రమణయ్య, మునగల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

# రొట్టెలు పండుగను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు

- అన్ని శాఖలు సమన్వయంతో పనిచేశాయి
- దర్గా అభివృద్ధికి ముఖ్యమంత్రి 5 కోట్లు మంజూరు చేయడం పట్ల కృతజ్ఞతలు : టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** నెల్లూరు బారాషహీద్ దర్గా రొట్టెల పండుగను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని టిడిపి నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి పేర్కొన్నారు. బారాషహీద్ దర్గా ప్రాంగణంలో శనివారం సాయంత్రం ఆయన మీడియా మాట్లాడుతూ.. నెల్లూరు జిల్లా మంత్రుల సూచనలతోపాటు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో రొట్టెల పండగను విజయవంతం చేసేందుకు అన్ని శాఖల అధికారులు పూర్తిస్థాయిలో సమన్వయంతో పనిచేసి సహకరించారన్నారు. ఇప్పటికే 7 లక్షల మంది భక్తులు రొట్టెల పండగ హాజరై బారాషహీద్‌లను దర్శించుకున్నారన్నారు. గతంలో కంటే ఈ ఏడాది పారిశుధ్యంతో పాటు మౌలిక వసతులపై ప్రధానంగా దృష్టి సారించి భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూసామన్నారు. సీఎం చంద్రబాబు కూడా వర్చువల్ సమావేశం ఏర్పాటు చేసి భక్తులతో స్వయంగా మాట్లాడారని, బారాషహీద్ దర్గా అభివృద్ధికి ఐదు కోట్ల రూపాయల నిధులను కూడా విడుదల చేస్తున్నట్లు ఆయన ప్రకటించారన్నారు. కార్యక్రమంలో దర్గా కమిటీ చైర్మన్ ఖాదర్ బాషా, సయ్యద్‌సమీ, సాబీర్‌ఖాన్, షంషూద్దీన్‌లు పాల్గొన్నారు.

# విజ్ఞాన్‌లో ఉత్సాహంగా ఫ్రెషర్స్ డే వేడుకలు



**పొదలకూరు మేజర్‌న్యూస్ :** విజ్ఞాన్ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరంలో చేరిన విద్యార్థులను ఆహ్వానిస్తూ.. ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ఫ్రెషర్స్ డే వేడుకలను స్థానిక బోగోలు కృష్ణారెడ్డి కళ్యాణ మండపంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సిహెచ్‌సి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రసాద్, స్థానిక ఎస్ఐ డి.రామకృష్ణ, టిటిడి విజిలెన్స్ రిటైర్డ్ డిఎస్పి ప్రభాకర్ గౌడ్ హాజరయ్యారు. కాలేజీ కరస్పాండెంట్ మూలంరెడ్డి, సుధాకర్ రెడ్డి, యాజమాన్యం గువ్వల నారాయణరెడ్డి, ఎం.సుబ్బారెడ్డి, బోగోలు భాస్కర్ రెడ్డి, ఎన్వి.రెడ్డి అన్నం సుబ్బారావు, అకడమిక్ ఇన్‌చార్జ్ కృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ ఏ.చంద్రశేఖర్ హాజరై, జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జూనియర్ విద్యార్థులకు అవసరమైన సలహాలను అందిస్తూ తమ లక్ష్య

## అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

సాధనకు కృషిచేసే విధంగా దిశానిర్దేశం చేయడంలో సీనియర్ విద్యార్థులు కీలకపాత్ర పోషించాలన్నారు. చదువుతోపాటు, ఆటపాటలు, క్రమ శిక్షణ, టీపీ జ్ఞాపకాలతో జీవితంలో ముందుకు పోవాలని సూచించారు. చదువు కంటే సంస్కారం ముఖ్యమని, తల్లిదండ్రులు చదువుల విషయంలో అబ్బాయిలు, అమ్మాయిలంటూ వ్యత్యాసం చూపకూడదన్నారు. బాల్యం నుంచి ఉద్యోగం వచ్చే వరకు వివిధ వ్యక్తుల,ప్రముఖుల కెరీర్ లో ముఖ్య సంఘటనలు విద్యార్థులతో పంచుకున్నారు. అందరిని గురించి అందరూ తెలుసుకోవడానికి ఈ ఫ్రెషర్స్ డే వేడుకలు ఉపయోగపడతాయన్నారు. అనంతరం మండల స్థాయిలో ర్యాంకులు సాధించిన విద్యార్థులకు స్వర్గీయ మూలంరెడ్డి, శేషారెడ్డి జ్ఞాపకార్థం జ్ఞాపికలను, నగదు బహుమతులను అందజేశారు. అలాగే తెలుగులో 99 మార్కులు వచ్చిన విద్యార్థులకు తెలుగు ప్రతిభా పురస్కారంతోపాటు, బహుమతులను అందజేశారు. విద్యార్థులు మంచి మానవీయ సంబంధాలకు ఇందోక పరిచయక వేదిక అని అన్నారు. విద్యార్థుల మధ్య సహృద్భావ వాతావరణం పెంపొందించడానికి ఇటువంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయన్నారు. మధ్యాహ్నం నుంచి విద్యార్థులు పలు సినీ గీతాలకు, జానపద గేయాలకు వేసిన డాన్సులు, స్కిట్లు అందర్నీ అల్లరించాయి. ఈ కార్యక్రమం అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

# డైలీ వేజ్ కార్మికులకు జీతాలు చెల్లించాలి

- అడ్డదారిలో తీసుకున్న కార్మికులను తొలగించాలి
- ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు




**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి మున్సిపాలిటీలో పనిచేస్తున్న డైలీ వేజ్ కార్మికులకు వెంటనే జీతాలు చెల్లించాలని, అలానే అడ్డదారిలో నిబంధనలకు విరుద్ధంగా మున్సిపల్ కార్మికులుగా తీసుకున్న 27 మందిని తొలగించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు మలి వెంకయ్య మలి వెంకయ్య డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని జర్నలిస్ట్ క్లబ్ నందు మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నేతలతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కావలి మున్సిపాలిటీలో డైలీ వేజ్ కార్మికులుగా పనిచేస్తున్న కార్మికులకు నాలుగు నెలల జీతాలు ఇవ్వలేదని, వారిని ఆప్కాస్‌లో కూడా చేర్చలేదని వారి వివరాలు మున్సిపల్ అధికారులకు తెలియజేసినా పట్టించుకోలేదని వారికి జీతాలు చెల్లించిన యెడల సమ్మెబాట పట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. అలానే మున్సిపల్ కార్మికులు చనిపోయినా, రిటైర్డ్ అయినా వారి పిల్లలకు కానీ, వారి కుటుంబ సభ్యులకు కానీ ఉద్యోగ అవకాశాలు ఇవ్వాల్సి ఉన్నా అలా కాకుండా కొత్తవారిని నిబంధనలకు విరుద్ధంగా మున్సిపల్ కార్మికులుగా 27 మందిని తీసుకొని వారిలో 13 మందికి జీతాలు కూడా వేసినట్లు తెలుస్తుందని ఇలాంటి చర్యలను మున్సిపల్ అధికారులు ప్రోత్సహించడం మంచి పద్ధతి కాదని తెలిపారు. మున్సిపల్ అధికారులు కొత్తగా తీసుకున్న 27 మంది కార్మికుల పై సమగ్ర విచారణ జరిపి వారిని తొలగించాలని, అలానే డైలీ వేజ్ కార్మికులకు వెంటనే జీతాలు ఇవ్వాలని లేనియెడల రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఉద్యమం చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి గుంజి కిషోర్, కావలి టౌన్ అధ్యక్షుడు ఎండ్లూరి ఆదినారాయణ, కార్యదర్శి తన్నీరు వెంకటేష్, ఏఐటియుసి సహాయ కార్యదర్శి ఎండ్లూరి రవి, కార్మిక నాయకులు గుంజి అంకయ్య, బందారు రాజేష్ ఏసుపోగు, ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

# నైతిక జీవనంపై అవగాహన

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** పట్టణంలోని ప్రభుత్వ, మేకపాటి వెంకురెడ్డి, ప్రగతి జూనియర్ కళాశాలల్లో శనివారం స్టూడెంట్స్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా వారి ఆధ్వర్యంలో విద్యార్థులకు నైతిక జీవనంపై అవగాహన కార్య క్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంస్థ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అబ్దుల్వాఫీజ్ మాట్లాడుతూ.. దేశాభివృ ద్ధిలో విద్యార్థులు, యువత పాత్ర కీలకమన్నారు. నేటి యువత లక్ష్య రహిత జీవితం, నైతిక పతనానికి లోనైందన్నారు. తమ విలువైన సమయాన్ని మొబైల్ గేమింగ్, బెట్టింగ్, ధూమపానం, మద్యం, మాదకద్రవ్యాలకు వెచ్చిస్తూ మానసిక రుగ్మతలకు గురవుతున్నారన్నారు. అలాంటి యువత లో బాధ్యతాయుత భావాన్ని జనింపచేసి సమాజంలో పేరుకుపోయిన చెడును నిర్మూలించేందుకు కృషి చేయడమే లక్ష్యమన్నారు. అనంతరం గోడపత్రికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐఓ జిల్లా ఆర్గనైజర్ అజరుల్లా, కార్యదర్శి షాహిద్, ముజిమిల్ తదితరులు పాల్గొన్నారు.

## రొట్టెల పండుగలో.. తప్పిపోయిన 435 చిన్నారులను తల్లిదండ్రులకు అప్పగింత




**నెల్లూరు క్రైం, మేజర్‌న్యూస్ :** నెల్లూరు బారా షాహిద్ దర్గాలో జరుగుతున్న రొట్టెల పండుగలో తప్పిపోయిన 435 మంది చిన్నారులను వారి తల్లిదండ్రులకు అప్పగించడం జరిగిందని జిల్లా ఎస్పీ జి.కృష్ణ కాంత్ తెలిపారు. శనివారం ఆయన దర్గా ప్రాంగణంలో తనిఖీలు నిర్వహించి బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు. అదేవిధంగా తాత్కాలికంగా ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూమ్ ద్వారా సీసీ కెమెరాల పుటేజిలను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు ఆదేశాలు జారీ చేశారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా చూసుకోవాలన్నారు. బ్యాగులు, ఏటిఎంలు పోగొట్టుకున్న వారికి తమ సిబ్బంది అప్పటికప్పుడే చేదించి సంబంధించిన వారికి అప్పగించడం జరిగిందన్నారు. బయటి ప్రాంతాల నుంచి వచ్చిన వాహనాలు పార్కింగ్ ప్రదేశాల్లో ఉంచి ట్రాఫిక్‌కు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చేయడం జరిగిందన్నారు. రొట్టెలు మార్చుకునే ప్రాంతంలో పోలీస్ సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ భక్తులకు సహాయ సహకారాలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ వెంట అడిషనల్ ఎస్పీ సౌజన్య, డిఎస్పీలు, సిఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

## జవహర్ భారతి భారతి డిగ్రీ కళాశాల విద్యార్థుల విజయ కేతనం



**కావలి, మేజర్‌న్యూస్ :** విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం 5వ సెమిస్టర్ డిగ్రీ పరీక్ష ఫలితాలు వెలువడిన ఈ ఫలితాల్లో జవహర్ పార్టీ డిగ్రీ కళాశాల విద్యార్థిని, విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించి విజయ దుందుభి మోగించారు. ఎకనామిక్స్ హిస్టరీ, పొలిటికల్ సైన్స్ నందు నూరు శాతం ఉత్తీర్ణత సాధించారు. బీఎస్సీ కోర్సులో ఫిజిక్స్, బోటనీ, జువాలజీలలో మూడు శాతం ఉత్తీర్ణత సాధించారు. బిఎస్సి, ఎంఎస్‌సి గ్రూప్ నందు సబీనా 9.83 గ్రేడ్ పాయింట్స్ సాధించి కావలి పట్టణంలో ద్వితీయ స్థానంలో నిలిచారు. బిఎస్సి, సిడిజెడ్ గ్రూప్ నందు పి.నరేంద్ర, ఎస్.దివ్యలు విద్యార్థులు యూనివర్సిటీ ప్రథమ, ద్వితీయ స్థానాల్లో ఉత్తమ విజయాన్ని సాధించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు విశ్వదయ రెక్టర్ డి.వినయ్ కుమార్ రెడ్డి, కస్పాండెంట్ వి.సుధాకర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ పి.సుబ్రహ్మణ్యం నాయుడు, సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సు డైరెక్టర్ డాక్టర్ ఆర్.మాల్యాద్రి అభినందించారు. 2024-25 విద్యా సంవత్సరంకు సంబంధించిన ఫస్ట్ ఇయర్ కోర్సులో బీఎస్సీ ఆనర్స్, ఫిజిక్స్, బోటనీ, కంప్యూటర్, సైన్స్, డైలీ సైన్స్, పొలిటికల్ సైన్స్, బీకాం ఆనర్స్, కంప్యూ టర్ అప్లికేషన్ బి.ఒకేషనల్ ఆనర్ ఆక్వా కల్చర్ అడ్మిషన్లు జరుగుతున్నాయని తెలిపారు.

# విద్యార్థులకు విద్యా సామాగ్రి పంపిణీ



**బుచ్చిరెడ్డిపాలెం, మేజర్‌న్యూస్ :** బుచ్చిరెడ్డిపాలెం మండలం రెడ్డి పాలెం గ్రామంలోని ఎంపీపీ మండల ప్రాథమిక పాఠశాల నందు చదువుతున్న బాలబాలికలకు బుచ్చిరెడ్డిపాలెం సహారా ఎడ్యుకేషనల్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ వారి ఆధ్వర్యంలో నోట్స్‌లు పెన్సిల్స్ పలకలు పెన్నులు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గ్రామ సర్పంచ్ బి.వెంకట రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పిల్లలు బాగా చదువుకోవాలి ప్రతిరోజు బయటికి రావాలని తెలియజేశారు. అనంతరం సొసైటీ అధ్యక్షుడు ఎస్.కె యజాని బాషా మాట్లాడుతూ.. ప్రతి పేదవాడు చదువుకొనుటకు మంచి అవకాశాలు ఉన్నాయి. ప్రభుత్వం అన్నియుధాల సహాయ సహకారాలను ఇస్తున్నారు. మధ్యాహ్నం భోజనం యూనిఫారాలు బూట్లు ప్రభుత్వ పాఠశాలలకు ప్రైవేట్ పాఠశాల ధీటుగా అన్ని సౌకర్యాలు ఉన్నాయి. కాబట్టి మీరందరూ బాగా చదువుకొని విద్యావంతులై తల్లిదండ్రులకు గురువుకు గ్రామానికి మంచి పేరు తేవాలని పాఠశాల ప్రధానోపాధ్యాయులు సిహెచ్ బ్రీజా కుమారి ఉపాధ్యాయులు వేణుగోపాల్ సొసైటీ సభ్యులు పటాన్ రహమతుల్లా పాల్గొన్నారు.

# బారాషాహీద్ దర్గాలో జనసేన నాయకులు





**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** గునుకుల కిషోర్ నూనె మల్లికార్జున యాదవ్ జమీర్ భాయ్ సంకల్ప దీక్షతో సాగుతున్న అధ్యక్షులు పవన్ కళ్యాణ్ సీఎం కావాలని గత నాలుగు సంవత్సరాల నుంచి బారాషాద్ దర్గాలో రొట్టెలు అందుకోవటం జరిగింది. అందరి దేవుళ్ళ దీవెనలతోపాటు ప్రకృతి కూడా మాకు సహకరించి మా అధ్యక్షులు డిప్యూటీ సీఎం అయ్యారు. 12మంది అమరవీరులను తమకోర్కెలు తీర్చుకునేందుకు తీరిన వారు మొక్కు చెల్లించుకునేందుకు ప్రపంచ నలుమూలల నుండి వచ్చిన భక్తులతో బారాషాహీద్ దర్గా రొట్టెల పండుగ కిక్కిరిసింది. కులమతాలకతీతంగా కలిసి మెలసి చేసుకొనే ఈ విశిష్ట పండుగ మన నెల్లూరులో జరగడం మన అదృష్టం జనసేన పార్టీ జిల్లా నాయకులు పవన్ కళ్యాణ్ డిప్యూటీ సీఎం అయ్యారని, మరింత మంచి పదవులు అధిరోహించాలని ప్రజా రంజక పాలన సాగించాలని ప్రార్థనలు జరిపారు. 12 మంది వీరులకు స్మారకంగా ప్రతి సంవత్సరం భక్తులు కోర్కెలు తీరుస్తున్న బారాషాహీద్ దర్గా వద్ద ఏర్పాట్లను ఈసారి ప్రజా నాయకులు మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు అబ్దుల్ అజీజ్ అద్భుతంగా తీర్చిదిద్దారు. భక్తులకు ఏ విధమైన అసౌకర్యానికి గురికాకుండా అన్ని వసతులు సమకూర్చారు.

# సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తత అవసరం



**బుచ్చిరెడ్డిపాలెం, మేజర్‌న్యూస్ :** వర్షాకాలం ప్రారంభం కావడంతో సీజనల్ వ్యాధులు ప్రభలే అవకాశం ఉందని బుచ్చిరెడ్డిపాలెం మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జొన్నవాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య అధికారి అహ్మద్‌బాబు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాకాలంలో ప్రజలు సీజనల్ వ్యాధులకు గురయ్యే ప్రమాదం ఉన్న నేపథ్యంలో ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఆయన వివరించారు. వాతావరణంలో సీజనల్ మారినప్పుడల్లా క్రిములు కూడా మారుతాయి అన్నారు. వర్షాకాలంలో నీరు నిలిచిపోవడం, నీరు కలుషితం అవడం జరుగుతాయన్నారు. దీంతో నీటి నిల్వలు వలన దోమలు వృద్ధి చెంది మలేరియా, డెంగ్యూ వ్యాధులు, నీటి కలుషితం వలన కామెర్లు, వాంతులు, విరోచనాలు, టైఫాయిడ్, వంటి వ్యాధులు సోకే ప్రమాదం ఉందన్నారు. వాతావరణం మారినప్పుడు చలిగాలి తగిలినప్పుడు దగ్గు, జలుబు, గొంతులో ఇన్ఫెక్షన్, జ్వరంతోపాటు శరీరంలో కపం తొందరగా బయటకు రాదని, కఫం లోపల ఉండటం వలన త్వరగా ఇన్ఫెక్షన్ చేరుతుందన్నారు. చిన్నపిల్లలు, వృద్ధులలో రోగ నిరోధక శక్తి తక్కువగా ఉంటుందని జ్వరాలు ఎక్కువగా సోకే ప్రమాదం ఉందన్నారు. ప్రజలు సీజనల్ వ్యాధులకు దూరంగా ఉండడానికి దోమలు వృద్ధి చెందకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, కాచి చల్లార్చిన నీరు త్రాగాలని, బయట ఆహారంకు దూరంగా ఉండి ఇంటిలో తయారుచేసిన ఆహారాన్ని తీసుకోవాలని, బాగా ఉడికించిన పదార్థాలను తీసుకోవాలని, చేతులు శుభ్రంగా కడుక్కోవాలని, జింక్ ఫుడ్‌కు దూరంగా ఉండాలని, రోగ నిరోధక శక్తి పెరగడానికి సి విటమిన్ ఉన్న పండ్లు తీసుకోవాలని సూచించారు. సీజనల్ వ్యాధులకు సంబంధించి లక్షణాలు కనిపిస్తే తమ గ్రామాలలో ఉన్న ప్రభుత్వ విలేజ్ క్లినిక్లను ఉపయోగించుకోవాలని చికిత్సలు పొందాలని డాక్టర్ అహ్మద్ బాబు విజ్ఞప్తి చేశారు.

## మర్రిపాడు ఉపాధి సిబ్బందిపై పీడీ ఆగ్రహం



**మర్రిపాడు, మేజర్‌న్యూస్ :** జిల్లాలోని మర్రిపాడు మండల ఉపాధి సిబ్బందిపై అసిస్టెంట్ డ్రామా పీడీ శ్రీనివాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన శనివారం మర్రిపాడు ఉపాధి కార్యాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉపాధి సిబ్బంది ఆయన వచ్చే వరకు కార్యాలయంలోనే ఉండడంతో సీరియస్ అయ్యారు. ఇంతవరకు గ్రామాల్లోని పనులు వద్దకు వెళ్లకుండా కార్యాలయాల్లో ఏం చేస్తున్నారని నిలదీశారు. నిత్యం ఇలా చేస్తున్నారా లేక ఇదొక్కరోజా అని ప్రశ్నించారు. పనుల వద్దకు వెళ్లకుండా ఇంకొకసారి నిర్లక్ష్యం వ్యవహరిస్తే వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. దీంతో పాటుగా కార్యాలయం అపరిశుభ్రంగా ఉండడంతో అసహనం వ్యక్తం చేశారు. అనంతరం కార్యాలయంలోని పలు రికార్డులను పరిశీలించారు. మండలంలో పనిచేసే ఫీల్డ్ అసిస్టెంట్ టెక్నికల్ అసిస్టెంట్ల పనితీరును వారి స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో కొత్త మేర పనులు ఏమైనా పెడుతున్నారా లేదా అని ఆరా తీశారు. ప్రతి ఒక్కరూ విధులకు హాజరై ప్రజలకు పని కల్పించే విధంగా చర్యలు చేపట్టాలని తెలిపారు.

## పంచాయతీలలో గ్రామ సభలు నిర్వహించండి : ఎంపీడీవో తాజ్ మస్థూర్

**అనంతసాగరం, మేజర్‌న్యూస్ :** అనంతసాగరం మండలంలోని ప్రతి పంచాయతీలలో గ్రామసభలు నిర్వహించాలని ఎంపీడీవో తాజ్ మస్థూర్ ప్రకటనగా తెలిపారు. పంచాయతీరాజ్ చట్టంలోని సెక్షన్-6ను అనుసరించి మండలంలోని 25 పంచాయతీలలో కార్యదర్శిలు సోమవారం నుండి శుక్రవారం వరకు గ్రామ సభలు చేపట్టాలని ఆయన అన్నారు. సర్పంచ్ అధ్యక్షతన జరిగే గ్రామసభలలో గ్రామంలో జరిగిన వివిధ కార్యక్రమాలపై సమీక్షలు, భవిష్యత్తులో చేపట్టాల్సిన పనులపై తీర్మానాలు చేయాలని సూచించారు. వాటికి సంబంధించిన ఫోటోలను నేషనల్ పంచాయితీ పోర్టల్‌లో అప్లోడ్ చేయాలని తెలిపారు.

**ప్రశ్నించే గొంతులు, ప్రజా పోరాటాలే..**

## అవినీతి, అక్రమాలను ఆపగలవు

**- న్యాయవాది కాకు మురళి రెడ్డి**



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** ప్రజా పోరాటాలు, ప్రశ్నించే గొంతులే అవినీతి, అక్రమాలను ఆపగలవని, నెల్లూరు మునిసిపల్ కార్పొరేషన్ ఫోర్జరీ స్కామ్ విషయంపై సామాజిక కార్యకర్త న్యాయవాది కాకు మురళి రెడ్డి నెల్లూరు ప్రెస్‌క్లబ్ నందు విలేకరుల సమావేశంలో అన్నారు. నెల్లూరు మునిసిపల్ కార్పొరేషన్ ఫోర్జరీ స్కామ్‌లో ఎఫ్ఐఆర్ రిజిస్టర్ చేయడం పై అయన హర్షం వ్యక్తం చేశారు. కేవలం కేసు రిజిస్టర్ చేయడంతో విచారణ పూర్తి అయినట్టు కాదని, ఈ అవినీతి కుంభకోణంలో భాగస్వాములైన ప్రతి ఒక్కరిని చట్టం ముందు దోషులుగా నిలబెట్టే వరకు తమ పోరాటం కొనసాగుతుందని అయన తెలిపారు. కేవలం ఉద్యోగులను మాత్రమే బాద్యులుగా చేయకుండా, ఈ స్కామ్‌లో గత ప్రభుత్వంలో కీలకంగా వ్యవహరించిన వైసీపీ కార్పొరేటర్లు, ముఖ్య నేతల పాత్ర ఏంటో తేల్చాలని అయన డిమాండ్ చేశారు. ఆధారాలను తారుమారు చేయకముందే దోషులుగా ఉన్నవారిని అరెస్ట్ చేసి విచారణ చేయాలనీ ఆయన డిమాండ్ చేసారు. దేశంలోనే ఎన్నడూ ఎరుగని ఇద్దరు ఐఏఎస్‌ల సంతకాలు ఫోర్జరీ సామాన్య విషయం కాదని, ఈకేసు విచారణ పారదర్శకంగా జరపాలని ఎంతటి స్థాయిలో ఉన్న వారైనా వారు చట్టం ముందు సమానమేనని అయన అన్నారు. రాష్ట్రంలోనే సంచలనంగా మారిన ఈ అవినీతి కుంభకోణంపై విజిలెన్సు విచారణ సైతం జరగాలని డిమాండ్ చేసారు. ఈ పోరాటంలో తనకి అండగా నిలిచిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలియచేస్తున్నానని అన్నారు.

# ప్రశాంత వాతావరణంలో కొనసాగుతున్న రొట్టెల పండుగ





















### మున్సిపాలిటీకి స్పెషల్ గ్రాంట్ కింద

# రూ.74లక్షలు మంజూరు చేయించిన ఎమ్మెల్యే

**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి పట్టణం గ్రేడ్ వన్ మున్సిపాలిటీ గత వైసిపి ప్రభుత్వం మున్సిపాలిటీ రోడ్లు డ్రైనేజీలు అస్తవ్యస్తంగా తయారయ్యాయి. 2024 సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత కావలి నియోజక వర్గంలో అభివృద్ధి పరుగులు పెడుతుంది. అన్నం లో సందేహం లేదు ఎందుకంటే కావలి ముసు నూరు రోడ్డును గత ఐదు సంవత్సరాలలో ఏ విధంగా ఉన్నదో పాదాచార్యులు ద్విచక్ర వాహన దారులు ఏ రీతిగా అవస్థలు పడ్డారో మనకు అందరికీ తెలిసింది ఇప్పుడైతే ఆ రోడ్డు ఎంతో సుశాలంగా ఎత్తు పల్లాలు లేకుండా పాదాచారు లు చక్కగా ద్విచక్ర వాహన దారులు ప్రమాదాలు జరగకుండా ప్రజలు సంతోషాన్ని వ్యక్తపరిచారు. టిడిపి ప్రభుత్వం అధికారంలోకి రాగానే కావాలి శాసనసభ్యులు రోడ్డును నిర్మించడం విశేషం. అంతేకాకుండా కావలి శాసనసభ్యులు కావ్య కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. కావలి మున్సిపాలిటీకి ప్రభుత్వం స్పెషల్ గ్రాండ్ కింద 74 లక్షల రూపాయలు మంజూరు చేయించినట్లు **సూర్య** ప్రతినిధితో తెలిపారు. ఆగస్టు 15వ తేదీ లోపల పరిసర ప్రాంతాల్లో మొక్కలు చీకు లేకుండా అలాగే రోడ్లు, డ్రైన్లు ఎక్కడైతే అసంపూర్తిగాను అస్తవ్యస్తంగా ఉన్నాయో వాటిని గుర్తించి ఆగస్టు 15వ తేదీ లోపల స్వచ్ఛ కావలిగా రూపుదిద్దు కుంటుందని తెలిపారు. అంతేకాకుండా కావలి ఏ.ఎం బేకరీ ఎదురుగా ఉన్న అన్నా క్యాంటీన్ ఎదురుగా 100 అడుగుల ఎత్తులో ఒక ద్వీపాన్ని ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. కావలి పట్టణాన్ని సుందరంగా అన్ని విధాల అభివృద్ధి పరచేందుకు కావలి పట్టణ ప్రజలు నా మీద నమ్మకం ఉంచి నన్ను గెలిపించిన నా ప్రజలకు



అభివృద్ధి ధ్యేయంగా నిరంతరం పనిచేస్తానని ప్రజలకు సేవకుడిగా ఉంటానని వారు తెలిపారు.

# మండల అభివృద్ధికి అందరూ సహకరించాలి




**ఎంపీపీ మూలే పద్మజ వినయ్ రెడ్డి**

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** మండల అభివృద్ధికి పార్టీలకు అతీతంగా నాయకులు అధికారులు సహకరించాలని ఎంపీపీ మూలే పద్మజా వినయ్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం స్థానిక స్త్రీ శక్తి భవనంలో మండల సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేశారు. ఈ ప్రభుత్వం మారిన తరువాత మొదటి సారి సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఫోటో కానీ శాసనసభ్యులు కాకర్ల సురేష్ ఫోటో కానీ లేక పోవడాన్నీ గమనించిన తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు మట్లా రామయ్య, మట్లా వెంకటేష్‌లు ఎంపీడీవోను ప్రశ్నించారు. ఈ బ్యానర్ పాతది కొత్తగా వేపించలేదు అని తరువాత జరగబోయే సమావేశంలో తప్పకుండా ఎమ్మెల్యే ఫోటోలతో బ్యానర్లు ఉంటుందని చెప్పారు. ఈ సందర్భంగా ఎంపీపీ మూలే పద్మజా వినయ్ రెడ్డి మాట్లాడుతూ.. మండలంలోని సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. గ్రామాలలో తాగునీరు విష జ్వరాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆయా శాకలవారిని ఆదేశించారు. ఈ సమావేశంలో పాల్గొననీ మండల అధికారులకు సోషాజ్ నోటీసులు జారీ చేయమని ఎంపిడీఓకి చెప్పారు. మొదటిగా ఆయా శాకల అధికారులు గ్రామాలలో జరుగుతున్న అభి వృద్ధి కార్యక్రమలను వివరించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ మోడీ రామాంజనేయులు, మండల ఉపాధ్యక్షులు మట్లా శాంతి, ఎంపీడీఓ ఈశ్వరమ్మ, మండల విధ్యాదికారి తోట శ్రీనివాసులు, సర్పంచ్‌లు ఎంపీటీసీలు అధికారులు పాల్గొన్నారు.

# దళితులను గౌరవించే కుటుంబం మాది..

**పంచాయతీలో అక్రమాలు, అవినీతిపై విచారణకు సిద్ధం**



**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** దళిత కుటుంబాలను అదేవిధంగా ప్రజా ప్రతినిధులను గౌరవిస్తూ విలువిచ్చే కుటుంబం ఏదైనా ఉందంటే అది మా కుటుంబమే అని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా సంయుక్త కార్యదర్శి కాగుటూరు లక్ష్మణ్ రెడ్డి, గ్రామపంచాయతీ ఉప సర్పంచ్ కాకుటూరు అనితారెడ్డి అన్నారు. శనివారం ఉప సర్పంచ్ నివాస గృహం నందు మీడియా సమావేశాన్ని నిర్వహించారు. మండల ఎంపీపీ సుగుణ, వార్డు సభ్యులు సుజాత, మరి కొంతమంది గిరిజన కుటుంబాలు హాజరు కావడం జరిగింది. ఈ సందర్భంగా వైసీపీ నాయకులు కాకుటూరు మాట్లాడారు. గ్రామపంచాయతీ పాలకవర్గం, అదేవిధంగా వార్డు సభ్యులు ఆరోపణ చేయడం సమంజసంగా లేదని తెలియజేశారు. అవినీతి, అక్రమాలకు ఎవరు పాల్పడినారో ఆధారాలు చూపించామని వైసిపి నాయకులు పేర్కొన్నారు. ఇప్పటికైనా ఆరోపణ మానుకోవాలని పంచాయతీ పాలక వర్గానికి సూచించారు. అనంతరం ఉప సర్పంచ్ అనితా రెడ్డి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అవినీతి, అక్రమాలపై విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఎలాంటి విచారణకైనా తాము సిద్ధంగా ఉన్నామని ఉప సర్పంచ్ పేర్కొన్నారు. ఈసమావేశంలో పార్టీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## కౌలు కార్డులు పంపిణీ



**బుచ్చిరెడ్డిపాలెం, మేజర్‌న్యూస్ :** బుచ్చిరెడ్డిపాలెం మండలంలోని పెనుబల్లి, జొన్నవాడ గ్రామాలలో కౌలు రైతుల కార్డుల రైతులకు మంజూరు అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఇందులో భాగంగా మండల వ్యవసాయ అధికారి ఎం.సురేంద్రరెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి గ్రామంలో ఉన్న రైతు సేవ కేంద్రాల పరిధిలోని రైతులకు పంట సాగుదారున్ని హక్కు ధ్రువీకరణ పత్రాలను ఈ ఆన్‌లైన్ ద్వారా మంజూరు చేయడం జరుగుతుందని తెలియజేశారు. కౌలు రైతులను ప్రభుత్వం గుర్తించి వారికి కౌలు కార్డులను పంపిణీ చేయడం జరుగుతుందని కౌలు రైతులకు వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల వీఆర్వోలు, వీఏఏలు, జొన్నవాడ సర్పంచ్ కందికట్టు, పెంచలయ్య, రైతులు పాల్గొన్నారు.

## మహిళలకు భవాని ఎడ్యుకేషనల్ సొసైటి ఆదరణ




**బోగోలు, మేజర్‌న్యూస్ :** ఉమ్మడి ప్రకాశం జిల్లా గుడ్లూరు మండలం గుడ్లూరులో మతిస్థిమితం లేక రోడ్ మీద ఆకలితో అలమటిస్తూ తిరుగుతున్న 50 సంవత్సరాలు వయసున్న మహిళ గురించి తెలుసుకున్న బోగోలు మండలం ముంగమూరు భవాని ఎడ్యుకేషనల్ సొసైటి ఆదరణకేంద్రం డిప్యూటీ డైరెక్టర్ కట్టిపల్లి శ్రావణ్ కుమార్ గుడ్లూరునుండి తీసుకొచ్చి ఆదరణకేంద్రంలో చేర్పించి హక్కున చేర్చుకున్నారు. ఈ సందర్భంగా శ్రావన్‌కుమార్ మాట్లాడుతూ.. ఆదరణ కేంద్రంలో ఇప్పటికే ముప్పైమందికి పైగా నిరాశ్రయులకు ఆశ్రయమిస్తున్నామని, ఈ రోజు ఆదరణ లేక రోడ్ మీద తిరుగుతున్న మహిళను చేరదీసి ఆదరణ కల్పించడం బాధ్యతగా బావిస్తున్నానారు. ఆమెను మాములు మనిషిగా తయారు చేసి కన్నతల్లి లాగ చూసుకుంటామని తెలిపారు.

## తూములను పరిశీలించిన అధికారులు

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** మండలంలోని గండిపాళెం జలాశయం కుడి, ఎడమ తూముల షట్టర్లను. శనివారం జలవనరుల శాఖ డీఈ కందు కూరు చంద్రమౌళి నిపుణులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కుడి, ఎడమ ప్రధాన కాలువల తూముల షట్టర్లు మరమ్మత్తులకు గురై ఉండడంతో నీరు లీకేజీల రూపేణా వెళుతుంద న్నారు. దీంతో వాటికి మరమ్మత్తులు చేసేందుకు నిపుణులతో పరిశీలిం చడం జరిగిందన్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున త్వరలో తూముల షటర్లకు మరమ్మత్తులు చేసి లీకేజీలను అరికడతామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈలు సురేష్, వేణు, సిబ్బంది పాల్గొన్నారు.

## డీజల్ లేక ఆగిన ఆర్టీసీ

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** డీజల్ లేక ఆర్టీసీ బస్సు మార్గమధ్యంలో ఆగి ప్రయాణికులు అవస్థలు పడ్డ సంఘటన శనివారం చోటుచేసుకొంది. వివరాల మేరకు.. గురువారం రాత్రి ఉదయగిరి డిపోకు చెందిన సూపర్ లగ్జరీ బస్సు హైదరాబాదు వెళ్ళింది. అక్కడ తిరిగి మరలా శుక్రవారం రాత్రి ఉదయగిరికి బయలుదేరింది. శనివారం ప్రకాశం జిల్లా కనిగిరి అడ్డరోడ్డు వద్దకు వచ్చేసరికి బస్సు డీజల్ లేక ఆగిపోయింది. బస్సు డ్రైవర్లు డీజల్ తెచ్చి పోసినా బసు స్టార్ట్ కాలేదు. దీంతో ప్రయాణికులను మరో బస్సులో పంపించారు. అనంతరం కనిగిరి డిపో వారికి సమాచారం అందించడంతో మెకానిక్లు వచ్చి సరి చేసి బస్సును ఉదయగిరికి పంపారు. ఈ విషయమై డిపో మేనేజర్ శ్రీ నివాసరావును అడగ్గా కొత్త బస్సు కావడంతో డ్రైవర్లకు అవగాహన లేక డీజల్ అధికంగా ఖర్చయి బస్సు ఆగిందన్నారు.

# ప్రజలకు చౌకగా బియ్యం,కందిపప్పు సరఫరా

## ప్రభుత్వసరికొత్త నిర్ణయం ▫ ప్రారంభించిన ఆర్డీవో మధులత



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ధరల నియంత్రణలో భాగంగా ప్రభుత్వం ప్రజలకు చౌకగా బియ్యం, కందిపప్పులను అందించేలా సరికొత్త నిర్ణయం తీసుకొంది. ఈమేరకు శనివారం ఆత్మకూరులోని శ్రీ సింహాద్రిమెగాస్టోర్ వద్ద చౌకధరల సరుకుల పంపిణీని స్థానిక ఆర్డీవో కె.మధులత ప్రారంభించారు. ఆర్డీవో మధులత, తహశిల్దారు శివనాగి రెడ్డి, మండల తెలుగుదేశం ప్రధానకార్యదర్శి కేతా విజయభాస్కరరెడ్డి, సివిస్ డిప్యుటి తహశిల్దారు తదితరులు ప్రజలకు బియ్యం, కందిపప్పులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆర్డీవో మధులత మాట్లాడుతూ.. రాష్ట్రంలో ధరల నియంత్రణలో భాగంగా వినియోగదారుల వ్యవహారములు, ఆహార, పౌరసరఫరాల శాఖామంత్రి నాదెండ్ల మనోహర్, రాష్ట్ర పౌరసరఫరాల కమీషనర్, మేనేజింగ్ డైరెక్టర్ల సమక్షంలో ఈనెల 8వ తేదీ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న రైస్ మిల్లర్లు, పప్పుధాన్యల మిల్లర్లు, హోల్‌సేల్, రిటైల్ వ్యాపారులు, అనబంధసంస్థల ప్రతినిధులతో చర్చలు జరిపారని పేర్కొన్నారు. దేశవాళీ కందిపప్పు ఒక కెజి మార్కెట్లో 181రూపాయలుండగా వినియోగదారులకు 160 రూపాయలకే అందించేలా, నాణ్యమైనస్టీమ్ బియ్యం (బిపిటిరకం) కెజి ధర మార్కెట్లో దాదాపు 56 రూపాయలుండగా 49రూపాయలకే అందించేలా, నాణ్యమైన రా బియ్యం కెజి మార్కోట్‌ధర 52.40 రూపాయలుకాగా 48 రూపాయలకే అందించేలా, ఈ బియ్యం, కందిపప్పులను ప్రత్యేక కౌంటర్లద్వారా అందించేలా నిర్ణయించారని పేర్కొన్నారు. ఈమేరకు ఆత్మకూరు పట్టణంలోని ఆర్టీసీడిపో ఎదుట ఉన్న సింహాద్రి మెగా మార్ట్‌లో వినియోగదారుల సౌకర్యార్ధం శనివారం ప్రత్యేక కౌంటర్‌ను ప్రారంభించామని మధులత వెల్లడించారు. వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు రేషన్ షాపు డీలర్లు పాల్గొన్నారు. బియ్యం, కందిపప్పు నాణ్యమైన రకాలను చౌకగా ప్రజలకు అందించేలా ప్రభుత్వం నిర్ణయించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# గంజాయిని తరిమికొట్టాలి : పొదలకూరు ఎస్‌ఐ

**పొదలకూరు, మేజర్‌న్యూస్ :** గంజాయి, మత్తు పదార్థాలను తరిమికొట్టడంలో విద్యార్థులు భాగస్వా ములు కావాలని పొదలకూరు ఎస్‌ఐ డీ.రామకృష్ణ, స్థానిక సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రసాద్ కోరారు. పట్టణం లోని ఓ ఫంక్షన్ హాల్లో విజ్ఞాన్ జూనియర్ కాలేజి విద్యార్థులకు యాంటీ ర్యాగింగ్, మాదకద్రవ్యాల వినియోగంతో కలిగే పరిణామాలపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ రామకృష్ణ, డాక్టర్ ప్రసాద్ మాట్లాడుతూ.. యువత, విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని కోరారు. యువత, విద్యార్థులు గంజాయి, మత్తు పదార్థాలను తరిమికొట్టడంలో భాగ స్వామ్యం కావాలన్నారు. తల్లిదండ్రులు పిల్లల ప్రవర్తనపై దృష్టి సారించాలన్నారు. మత్తు పదార్థాలను మానేయలేని స్థితిలో ఉన్న వారిని తమ వద్దకు తీసుకురావాలని, మానసిక నిపుణులతో అవగాహన కల్పిస్తామని అన్నారు. ప్రతీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కళాశాలల్లో గంజాయి,




మత్తు పదార్థాలకు అలవాటు పడకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. గంజాయి, మత్తు పదార్థాలకు అలవాటు పడి యువత బంగారు భవిష్యత్ నాశనం చేసుకోవద్దన్నారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాలు విక్రయిస్తున్నా, రవాణా చేస్తున్నా సంబంధిత పోలీస్‌స్టేషన్‌కు లేదా సెల్ నెంబర్ 9440700007, డయల్ 100కు సమాచారం ఇవ్వాలని కోరారు. మహిళలు, బాలికలు ఎలాంటి ప్రమాదంలో ఉన్న ఆ నెంబర్లను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ ఎం సుధాకర్ రెడ్డి, కాలేజి డైరెక్టర్స్ ఎం సుబ్బారెడ్డి, ఎన్.వి రెడ్డి, భాస్కర్ రెడ్డి, డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపాల్ జి.ఎన్.రెడ్డి, జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్ సుబ్బారావు, టిటిడి విజిలెన్స్ డిఎస్సీ ప్రభాకర్ గౌడ్, అకడమిక్ ఇన్‌ఛార్జ్ కృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ ఏ.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## మురుగుకాలువగా మారిన పంటకాలువ



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు చెరువుక్రింద పొలాల వద్ద ఒక పంటకాలువ పూడికతో నింపుకొని మురుగుకాలువగా మారిందని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం ఆత్మకూరు మండల ప్రధానకార్యదర్శి లక్కు కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. ఆయన శనివారం స్థానిక మున్సిపల్ ఏయి వరలక్ష్మితోకలిసి ఈ కాలువను పరిశీలించి అక్కడ పరిస్థితిని వివరించారు. ఈ కాలువద్వారా రైతులకు సక్రమంగా సాగునీరందే పరిస్థితి లేదని ఆయన ఏయికి వివరించగా ఆమె కూడా నిశితంగా పరిశీలించారు. ఈకాలువ స్ట్రోమ్ వాటర్ కెనాల్ ఔట్‌ఫాల్1 అని, మున్సిపల్ కమీషనర్ దృష్టికి తీసుకెళ్ళి పూడికలు తీయించేలా చర్యలు తీసుకుంటామని వరలక్ష్మి పేర్కొన్నారు.

## సాగరంలో 131వ గంధ మహోత్సవ ఏర్పాట్లు

**అనంతసాగరం, మేజర్‌న్యూస్ :** మండల కేంద్రమైన అనంతసాగరంలో శ్రీ శ్రీ శ్రీ హజరత్ సయ్యదీన కరిముల్లా- షా -ఖాదరి రహమతుల్లాహి అలై 131వ గంధ మహోత్సవం నిర్వహణకు మత పెద్దలు సమాయత్తం అవుతున్నారు. ఈనెల 26వ తేదీ నుండి మూడు రోజులపాటు స్థానిక మసీదులో మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రత్యేక ప్రార్థనలు, ఉర్సు, కవ్వాలి తదితర కార్యక్రమాలను చేపట్టనున్నారు. ప్రతి ఏడాది ప్రతిష్టాత్మకంగా చేపట్టే ఈ గంధ మహోత్సవానికి ఇతర మండలాల నుంచి కూడా భక్తులు విశేషంగా పాల్గొన నున్నారు. నేపథ్యంలో మహోత్సవానికి విచ్చేయనున్న భక్తులకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.

## సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోండి : జిల్లా కలెక్టర్ ఆనంద్

**విడవలూరు, మేజర్‌న్యూస్ :** సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఆయా శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆనంద్ కోరారు. విడవలూరు ఆయన శనివారం ఆకస్మికంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అన్ని శాఖల అధికారుల సమన్వయంతో ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా పారిశుధ్యం పై ప్రత్యేక ప్రణాళిక ఉండాలను కోరారు. ప్రతిరోజు పరిస్థితి సిబ్బంది చెత్తాను తొలగించడంతోపాటు బ్లీచింగ్ చల్లారని సైడ్ కాలువలలో మురికినీరు ప్రవహించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

## ఎంపీ వేమిరెడ్డికి ప్రసాదాలు అందజేత



**అనంతసాగరం, మేజర్‌న్యూస్ :** నెల్లూరు జిల్లా పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డికి అనంతసాగరం మండలం సోమశిల గ్రామానికి చెందిన ముస్లిం మత పెద్దలు ప్రసాదాన్ని అందజేశారు. శనివారం నెల్లూరులోని ఎంపీ నివాసానికి వెళ్లిన పెద్దలు వేమిరెడ్డిని సాలువతో ఘనంగా సత్కరించారు. అనంతరం హజరత్ సాహెబ్ బాదుల్లా పీర్ల మహోత్సవ దర్గా ప్రసాదాన్ని అందించారు. హజరత్ వారి ఆశీస్సులు మెండుగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో సయ్యద్ అబ్దుల్ రహమాన్, సయ్యద్ మహమ్మద్ హుస్సేన్, షేక్ మస్తాన్ వలి, ఖాదర్ బాషా, రసూల్ తదితరులు పాల్గొన్నారు.

## పొంగూరులో సీఎం ఫోటో ఏర్పాటు



**మర్రిపాడు, మేజర్‌న్యూస్ :** నెల్లూరు జిల్లా మర్రిపాడు మండలం పొంగూరు గ్రామ సచివాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఫోటోలు ఏర్పాటు చేయాలని ఆత్మకూరు నియోజకవర్గ ఎమ్మెల్యే దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఉత్తర్వులు మేరకు ఫోటోలను టిడిపి నాయకులు కార్యకర్తలు అభిమానులు శనివారం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్ర అభివృద్ధిలో భాగంగా ఆత్మకూరు నియోజకవర్గం ఎంతగానో మంత్రి ఆనం ఆధ్వర్యంలో అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పొంగూరు ఉప సర్పంచ్ ఏలూరు శివ, ఏలూరు రమణయ్య, ఏలూరు రామచంద్రయ్య, ఏలూరు వెంకటేశ్వర్లు, మన్నేపల్లి వెంకట రమణయ్య, సిద్దయ్య, కొన్ని సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

## సాగుహక్కు కార్డులపట్ల అవగాహన




**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని పంటవీధి, వెంకట్రావుపల్లి రైతుసేవాకేంద్రాల వద్ద శనివారం మండల వ్యవసాయాధికారి కె.కిషోర్‌బాబు రైతులకు కౌలురైతుల సాగుహక్కు పత్రాలు, వాటి ప్రాధాన్యత గురించి అవగాహన కల్పించారు. పంటసాగుదారులు హక్కుపత్రాలు పొందేవిధానంగురించి ఆయన వివరించి అవగాహన కల్పించారు. సిసిఆర్‌సి కార్డుల వలన కౌలురైతులు ప్రభుత్వం సబ్సిడితో అందించే విత్తనాలు, పంటనమోదు, పంటలభీమా, ప్రకృతివైపరీత్యాలసమయంలో పరిహారం పొందడం, ఇతర ప్రభుత్వం అమలుచేసే వ్యవసాయపధకాలు తదితర ప్రయోజనాలు పొందగలరని కిషోర్‌బాబు వివరించారు. ఈకార్యక్రమంలో వెంకట్రావుపల్లి విఆర్వో షేక్ రహమతుల్లా, మెప్మాసచివాలయ విఆర్వో ఐ.లావణ్య, వెంకట్రావుపల్లి ఆర్‌ఎస్‌కె ఎంపియివో ఏ.ఇంద్రాణి, పంటవీధి ఆర్‌ఎస్‌కె ఏ.రేణుక, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# బోధనలో కార్పోరేట్ స్కూల్స్‌తో పోటీ పడండి

- మినగల్లు హై స్కూల్స్‌లో విద్యాకిట్ల పంపిణీ
- ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత రాకుండా కృషి చేస్తాం..
- విద్యార్థులను బావి పౌరులుగా తీర్చిదిద్దే గురుతర బాధ్యత మాత్రం గురువులదే
- కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి



**బుచ్చిరెడ్డిపాలెం, మేజర్‌న్యూస్ :** డ్రాప్ అవుట్స్ నివారించడంలో అధికారులతో పాటు స్థానిక నాయకులు చొరవ తీసుకుంటేనే సాధ్యమని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి పేర్కొన్నారు. బుచ్చిరెడ్డిపాళెం మండలం మినగల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యాకిట్ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. మినగల్లు ఏఆర్ఆర్ హైస్కూల్ విద్యార్థినీ విద్యార్థులకు విద్యాకిట్ల అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ.. ఆలనా పాలన మాత్రమే తల్లి తండ్రులు చేయగలరని వారిని పిల్లలను బావి పౌరులుగా తీర్చిదిద్దే గురుతర బాధ్యత మాత్రం గురువులదే నన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే పిల్లల పట్ల ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని చదువుతోపాటు వారికి నైతిక విలువలను కూడా బోధించాలని కోరారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా తన తొలి సంతకం మెగా డీఎస్సీ మీద పెట్టిన నేపథ్యంలో ప్రభుత్వ పాఠశాలలో ఇకపై ఉపాధ్యాయుల కొరత ఉండదని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థినీ విద్యార్థులతో కళ కళలాడాలని ఆకాంక్షించారు. కార్పోరేట్ పాఠశాలలతో పోటీ పడేలా అత్యుత్తమ ఫలితాలు సాధించేలా ప్రభుత్వ పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ప్రైవేటు పాఠశాలలతో పోలిస్తే ప్రభుత్వ స్కూళ్ళలో నైపుణ్యం గల ఉపాధ్యాయులతోపాటు అత్యుత్తమ బోధనా వసతులున్నాయని తల్లి తండ్రులకు సూచించారు. అనంతరం ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి విద్యార్థినీ విద్యార్థులతో కలిసి స్కూళ్ళలో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక సమస్యలు చెప్పుకునేందుకు వచ్చిన మహిళల నుంచి వినతి పత్రాలు స్వీకరించారు. ఎన్నికల సందర్భంగా ప్రజలలోనికి వెళ్ళడం కాదు ఎన్నికల అనంతరం కూడా ప్రజలతో మమేకమై వారి సమస్యలను తెలుసుకోవాలని స్థానిక నాయకులకు హితవు పలికారు. మినగల్లు గ్రామంలో జరిగిన కిట్ల పంపిణీ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి రామారావు, ఎంఈఓలు దిలీప్ కుమార్, వెంకటరత్నం, ఏపిఎం లలితా రెడ్డి, వీఆర్ఏఈ శ్రీనివాసులు రెడ్డి, ఆర్డబ్ల్యూసీఐ, సర్పంచ్ పూజిత, బుచ్చి అర్బన్ రూరల్ మండలాల టిడిపి అధ్యక్షులు శేషయ్య, హరికృష్ణ, సీనియర్ నాయకులు యర్రంరెడ్డి గోవర్ధన్ రెడ్డి, పుట్టా సుబ్రహ్మణ్యం యాదవ్, సూరా శ్రీనివాసరెడ్డి, సురేష్ రెడ్డి, తులసి సురేష్, బొర్రు రాము, జొన్నవాడ సర్పంచ్ కందికట్టు పెంచలయ్య, గద్దె నరసింహారావు, వెంకటరత్నం, ఉప్పల మహేంద్ర, సురేంద్ర, గోపి, జనసేన నాయకులు గుడి హరికుమార్ రెడ్డి, శ్రీనివాసులు స్థానిక టిడిపి నాయకులు సురేష్ రెడ్డి, నెల్లూరు ప్రభాకర్ రెడ్డి, బచ్చా బాయ్ తదితరులు పాల్గొన్నారు.

## సూపర్ 6 పథకాలు విజయవంతం కావాలని

# రొట్టె పట్టుకున్న ఎమ్మెల్యే కోటంరెడ్డి



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** అపార పరిపాలనాను భవం గల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా సూపర్ 6 పథకాలు విజయవంతంగా అమలవుతాయని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. శని వారం బారా షహీద్ దర్గా రొట్టెల పండుగ నాల్గవ రోజున రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సూపర్ 6 పథకాలు విజయవంతం కావాలని కోరుతూ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఆరు భారీ రొట్టెలను పట్టుకున్నారు. తొలుత బారా షహీద్ దర్గాలో పూజలు చేసిన అనంతరం స్వర్ణాల చెరువులో సూపర్ 6 పథకాల పేర్లతో వినూత్నంగా ఏర్పాటు చేసిన ఆరు భారీ రొట్టెలను పట్టుకుని మనో సంకల్పంతో అందరికీ పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ.. రొట్టెల పండుగకు నిన్ననే వర్చువల్‌గా హాజరై బారా షహిద్ దర్గా ప్రార్థనా మందిరానికి ఐదు కోట్లు మంజూరు చేసిన ముఖ్యమంత్రికి కృతజ్ఞత లన్నారు. ముఖ్యమంత్రి కున్న దార్శనికత, అనుభవంతో గాడి తప్పిన రాష్ట్రాన్ని తిరిగి అభివృద్ధి పట్టాలెక్కిస్తారని, ప్రజల ఆశయాలు, ఆకాంక్షలు నెరవేరాలని కోరుతూ సూపర్ 6 పథకాలు విజయవంతమవ్వాలని కోరుకుంటూ ఆరు భారీ రొట్టెలను పట్టుకోవడం జరిగిందన్నారు. బారా షహీద్ రొట్టెల పండుగపై తనకు సంపూర్ణ విశ్వా సముందని, గత సంవత్సరం చంద్రబాబు సీఎం కావాలని కోరుకుంటూ రొట్టె పట్టుకోవడం జరిగిందన్నారు. అదేవిధంగా ఈ సంవత్సరం ప్రభుత్వ పథకాలు విజయవంతమవ్వాలని ఆశిస్తూ రొట్టెలు పట్టుకున్నామని, జిల్లా మంత్రులు పొంగూరు నారాయణ, ఆనం రామనారాయణ రెడ్డిల ఆధ్వర్యంలో ఖచ్చితంగా ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రొట్టెల పండుగ ఉత్సవ కమిటీ అధ్యక్షులు ఖాదర్ బాషా, మాజీ మేయర్ భానుశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

## ఫ్లోరోసిస్ పై మహిళలకు అవగాహన



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** గండిపాలెం పీహెచ్‌సీ పరిధిలో ఫ్లోరోసిస్ బారిన పడి ఇబ్బంది పడుతున్న మహిళలను గుర్తించి వాకర్స్ లంబార్ బెల్ట్స్ శనివారం ఉచితంగా పంపిణీ చేశారు. డాక్టర్ శివ కల్పన, డాక్టర్ దివ్య ఆధ్వర్యంలో ఎస్వి చింతల మరియు ఉదయగిరి బిట్ వన్ సచివాలయం నందు ఫ్లోరోసిస్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్లు మాట్లాడుతూ.. ఫ్లోరైడ్ కంటెంట్ ఎక్కువ ఉన్న నీటిని తాగితే ఫ్లోరోసిస్ సమస్యలు అధికంగా ఉంటాయని తెలిపారు. ఫ్లోరోసిస్ సమస్యతో బాధపడుతున్న మహిళలు క్యాల్షియం విటమిన్ సి ఎక్కువగా ఉండే ఆహార పదార్థాలు, పండ్లు తీసుకోవాలని కోరారు. ఈ సదస్సులో డెంటల్ ఫ్లోరోసిస్ స్క్రీనింగ్ చేయడం జరిగింది. అదేవిధంగా ఫ్లోరైడ్ కంటెంట్ అధికంగా ఉండే టూత్ పేస్ట్ వాడకం తగ్గించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ అంకమ్మ, హెల్త్ అసిస్టెంట్ మన్సూర్ అలీ, ఎంఎల్‌హెచ్‌పి అరుణ్, ఏఎన్ఎం ఏలేశ్వరమ్మలు పాల్గొన్నారు.

## జనవరి 18న నవోదయ ప్రవేశ పరీక్ష




**మర్రిపాడు, మేజర్‌న్యూస్ :** జిల్లాలోని మర్రిపాడు మండలం కృష్ణాపురం జవహర్ నవోదయ విద్యాలయంలో 2024-25 సంవత్సరానికి సంబంధించి 6వ తరగతిలో ప్రవేశం పొందుటకు 2025 జనవరి 18న ప్రవేశ పరీక్ష నిర్వహించడం జరుగుతుందని నవోదయ విద్యాలయ ప్రిన్సిపల్ గౌసియా బేగం శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. అందుకు సంబంధించి దరఖాస్తు స్వీకరణ జరుగుతుందన్నారు. అందువలన దరఖాస్తులు చేసుకునే అభ్యర్థులు చివరి తేదీ అయిన సెప్టెంబర్ 16వ తేదీ 2024 లోపు చేసుకోవాలని పేర్కొన్నారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఐదవ తరగతి చదివే విద్యార్థులు అర్హులన్నారు. ఈ దరఖాస్తులను ఆన్లైన్లో కానీ నవోదయ విద్యాలయంలో ఏర్పాటు చేసిన హెల్ప్ లైన్‌లో గాని చేసుకోవచ్చని తెలిపారు. మరిన్ని వివరాల కొరకు 8106898817, 9493514644, 8985007588 నంబర్లను సంప్రదించవచ్చునని అన్నారు.

## ప్రాథమిక వైద్య సేవలు శ్లాఘనీయం : డా. బి.శర్వాణి



**నెల్లూరు వైద్యం, మేజర్‌న్యూస్ :** హజరత్ బారాషాహీద్ దర్గా రొట్టెల పండగ సందర్భంగా ఏర్పాటు చేసిన ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నందు గ్రామీణ వైద్యుల ప్రాథమిక వైద్య సేవలు ఎంతో శ్లగనీయమని జిల్లా అందత్వ నివారణ సంస్థ ప్రోగ్రాం మేనేజర్ డాక్టర్ బి.శ్రావణి అన్నారు. శుక్రవారం, దర్గాను సందర్శించిన ఆమె ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వివిధ రాష్ట్రాల నుంచి ప్రాంతాల నుంచి కులమతాలకు అతీతంగా రొట్టెల పండగకు విచ్చేసిన భక్తులకు అవసరమైన ప్రాథమిక వైద్య సేవలు అందించుటలో రెడ్‌క్రాస్ ముందున్నదని, ఈ 4రోజులు రోజు 500 మందికి దాకా ప్రథమ చికిత్స చేయించుకుంటున్నారని, అస్వస్థత చేకూరిన భక్తులకు ప్రథమ చికిత్స అందించి, అత్యవసర కేసులను ప్రభుత్వ వైద్యశాలకు తరలించి మెరుగైన వైద్యం అందిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో పిహెచ్‌పి, ఆర్ఎంపి జిల్లా నాయకులు, రెడ్ క్రాస్ వాలంటీర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థికి ఆర్థికసాయం అందించిన ఎమ్మెల్యే



**కోవూరు, మేజర్‌న్యూస్ :** అన్ని దానాలలో కన్నా విద్యా దానం గొప్పదన్న విషయాన్ని ఆచరణలో అమలు చేసి చూపారు కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి. వీపీఆర్ స్కూల్‌లో 10వ తరగతిలో 580 మార్కులు సాధించి స్కూల్ టాపర్‌గా ప్రతిభ చాటిన ఉదయగిరి లక్ష్మి చరణ్ అనే విద్యార్థికి రూ.30వేల రుపాయలు ఆర్థికసాయం చేసి తమ దాతృత్వాన్ని చాటుకున్నారు. నారాయణ విద్యా సంస్థల్లో జూనియర్ ఇంటర్మీడియేట్ (ఎంపీసీ) చదువుతున్న లక్ష్మి చరణ్ తండ్రి ఉదయగిరి సురేష్ నెల్లూరులో హెూం గార్డ్‌గా విధులు నిర్వహిస్తుంటారు. ఎందరో నిరుపేద విద్యార్థులు తమ కలలను సాకారం చేసుకునేందుకు వారధిగా నిలుస్తున్న వీపీఆర్ ఫౌండేషన్ ప్రతిభ, పేదరికమే అర్హతగా ఉచిత విద్య అందిస్తుంది. ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి కరస్పాండెంట్‌గా వ్యవహరిస్తూ ఉన్నత విద్యా ప్రమాణాలతో నిర్వహించే వీపీఆర్ స్కూల్‌లో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు విద్యనభ్యసించిన లక్ష్మిచరణ్ 10వ తరగతిలో 580 మార్కులు సాధించి స్కూల్ టాపర్‌గా నిలిచాడు. తమ స్కూల్‌లో అత్యుత్తమ ప్రతిభ కనపరిచిన విద్యార్థినీ విద్యార్థుల ఉన్నత చదువుల ఖర్చు భరిస్తానని ప్రకటించిన ఎమ్మెల్యే ఉదయగిరి లక్ష్మి చరణ్ అనే విద్యార్థి పైచదువుకు ఆర్థిక సహాయం చేసి మాట నిలుపుకొన్నారు.